2. దయ నుంచు మయ్య యీ – దంపతులమీఁద స –దయుఁడవై కాపాడు – తం్రడి వలెను = నియమంబుగా వీరు – నీ చిత్తమును జరిపి – భయము లేకుండ గ – బ్రతుక నిమ్ము ॥కానా॥

3. ఒప్పు మీరఁగఁ జేయు – నొప్పందము వీర – లెప్పుడును మదిలోన – నిడికొనుచును = దప్పకుండఁగ దాని – నిప్పుడమిలో నెపుడు – గొప్పగా నెరవేర్ప – గూడ నుండు ॥కానా॥

4. చక్కఁగా నెగడింప – సంసార భారంబు – నెక్కు వగు నీ యాత్మ – నిపు డొసంగి = నిక్క మగు సరణిలో – నెక్కువగ నడిపించి – క్రక్కు నను దీవించు – కరుణానిధీ ॥కానా॥

5. పిల్లలను నీవొసఁగఁ – బ్రియముతో నో దేవ – పెల్లుగా బోధింప – వెరవు జూపు = మెల్ల వేళలలోన – నిరుకు మార్గము నందు – జల్లఁగా నడిపింప – శక్తి నిమ్ము ॥కానా॥

– పులిపాక జగన్నాథము

## 563 వివాహము

రా – జంఝూటి తా – ఆది

మానవుల మేలు కొరకు – జ్ఞానియైన దేవుఁడు = మానుగఁ కల్యాణ పద్ధతి – మహిని నిర్ణయించెగా ॥మానవుల॥

1. కానాయను నూరిలో మన –కర్త చూచెఁ బెండ్లిని = పానముగను ద్రాక్షరసము – దాన మొసఁగెఁ బ్రీతిని ॥మానవుల॥

2. యేసూ వీరిద్దరిని – ఏకముగాఁ జేయుమీ = దాసులుగను జేసి వీరి దోసము లెడబాపుమీ ॥మానవుల॥

3. కర్త వీరలకు భార్య – భర్తల ప్రేమంబును = బూర్తిగ నీ విచ్చి వీరిఁ బొందుగాను నడుపుమీ ॥మానవుల॥

4. భక్తియు విశ్వాస ప్రేమలు – భావమందు వ్రాయుమీ = ముక్తి సరణి వెదక వీరి భక్తి మిగులఁ జేయుఁమీ ॥మానవుల॥



## 564 దైవాశీర్వాదము

రా –శంకరాభరణము తా – ఆది

దేవర నీ – దేవెనలు – ధారళముగను వీరలపై = బాగుగ వేగమె దిగనిమ్ము – పావన యేసుని ద్వారగను ॥దేవర॥

1. దంపతులు దండిగ నీ – ధాత్రిలో వెలయుచు సంపదలన్ = సొంపుగ నింపుగ పెంపగుచు స – హింపున వీరు సుఖించుటకై ॥దేవర॥

2. ఈ కవను నీ కరుణన్ – ఆకరువరకును లోకములో = శోకము లేకయె యేకముగాఁ – బ్రాకటముగను జేకొనుము ॥దేవర॥

3. ఇప్పగిది నెప్పుడును – గొప్పగు ప్రేమతో నొప్పుచు దా = మొప్పిన చొప్పునఁ దప్పకను – మెప్పుగ బ్రతుకగఁ బంపు కృపన్ ॥దేవర॥

4. తాపములు పాపములు – మోపుగ వీరిపై రాకుండగాఁ = గాపుగఁ బ్రాపుగ దాపునుండి – యాపద లన్నియుఁ బాపుచును ॥దేవర॥

5. సాధులుగన్ జేయుటకై – శోధనలచే నీవు శోధింపగాఁ = కదలక వదలక ముదమున నీ – పాదము దాపునఁ బాదుకొనన్ ॥దేవర॥

6. మెండుగ భూమండలపు – గండములలో వీరుండగను = తండ్రిగ దండిగ నండనుండి – వెండియు వానిని ఖండించవే ॥దేవర॥

7. ఇద్ధర వీరిద్దరును – శుద్ధులై నిన్ను సేవించుటకై = శ్రద్ధతో బుద్ధిగ సిద్ధపడన్ – దిద్దుము నీ ప్రియ బిడ్డలుగాన్ ॥దేవర॥

8. వాసిగ నీ దాసులము – చేసిన యీ మొఱల్ దీసికొని = మా సకలేశ్వర నీ సుతుఁడౌ – యేసుని పేరిటఁ బ్రోవు మామేన్ ॥దేవర॥

–అల్లూరి పెదవీరాస్వామి